# రోడ్లకు కేంద్రం సాయం మరో 620 కోట్లు

- రాష్ట్రప్రభుత్వానికి తెలియజేసిన కేంద్ర సర్కార్
- ఇటీవల 400 కోట్లు మంజూరు
- ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతోనే నిధులు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం 'కేంద్ర రహదారుల నిధి' కింద మరో రూ.620 కోట్లను మంజూరు చేస్తూ అనుమతులిచ్చింది. సోమవారం ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం లభించింది. 'కేంద్ర రహదారుల నిధి' కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రతిపాదనలు పంపించింది. ఈ మేరకు కేంద్రం ఇటీవల రూ.400 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం దీనికి అదనంగా మరో రూ.620 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా వెల్లడించింది. ఈ విధంగా మొత్తమ్మీద 'కేంద్ర రహదారుల నిధి' కింద రాష్ట్రానికి రూ.1,020 కోట్లు లభించనున్నాయి. ఇంతకుముందున్న పది జిల్లాల ఆధారంగా పంపిన ప్రతిపాదనల మేరకు కేంద్రప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో.. జిల్లాల పరిధులు మారుతాయి తప్ప రోడ్లు అవే ఉంటాయి, కాబట్టి మారిన జిల్లాల పరిధులకు నిధులను విభజించి పంపిణీ చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

**కేంద్రంపై సీఎం ఒత్తిడి**

కేంద్ర రహదారుల నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రత్యేక శ్రద్ధ వహించి కేంద్రంపై ఒత్తిడి తేవడం వల్లే రెండు విడతలుగా రూ. 1,020 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. కేంద్రానికి పంపించిన ప్రతిపాదనలకు సంబంధించి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం కేసీఆర్ జరిపిన సంప్రదింపుల కారణంగానే నిధులు త్వరితగతిన మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

**పెట్రోల్‌పై పన్నులో భాగమే ఈ నిధులు**

దేశంలోని ప్రతి రాష్ట్రంలో పెట్రోల్ వినియోదారులు ఉపయోగించుకునే ప్రతీ లీటర్‌పై 17 పైసల చొప్పున కేంద్ర ప్రభుత్వం పన్ను వసూలు చేస్తున్నది. ఆ విధంగా సమకూరే డబ్బుల నుంచే కేంద్ర రహదారుల నిధి కింద వివిధ రాష్ట్రాలకు అందజేస్తున్నది.

**ఇప్పటివరకు మంజూరైన రూ.620 కోట్ల వివరాలు పాత జిల్లాల వారీగా..**

| సంఖ్య | జిల్లాపేరు | పనులు | రోడ్డు నిడివి కి.మీ | అంచనా వ్యయం (రూ. కోట్లలో) |
|---|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | 4 | 44.10 | 47.00 |
| 2. | కరీంనగర్ | 8 | 83.91 | 83.00 |
| 3. | ఖమ్మం | 5 | 74.70 | 76.00 |
| 4. | మహబూబ్‌నగర్ | 7 | 92.05 | 90.00 |
| 5. | మెదక్ | 6 | 64.10 | 74.00 |
| 6. | నల్లగొండ | 6 | 71.20 | 70.00 |
| 7. | నిజామాబాద్ | 4 | 55.94 | 55.00 |
| 8. | రంగారెడ్డి | 4 | 45.10 | 47.00 |
| 9. | వరంగల్ | 6 | 73.70 | 78.00 |
| **మొత్తం** | | **50** | **604.80** | **620** |

నమస్తే తెలంగాణ Tue, 18 October 2016
epaper.namasthetelangaana.com/c/13988202